క్లుప్తంగా

మహారాష్ట్ర స్టడీ టూర్‌కు కమిషనర్


శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్

తాడిపత్రి రూరల్: తాడిపత్రి మునిసిపల్ కమిషనర్ శివరామకృష్ణ బుధవారం మహారాష్ట్ర స్టడీ టూర్‌కు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ కమిషనర్లను దేశంలోని వివిధ రాష్ట్రాలకు స్టడీ టూర్లకు పంపుతోంది. ఇందులో భాగంగా మహారాష్ట్రకు కేటాయించిన బ్యాచ్‌లో తాడిపత్రి కమిషనర్ ఉన్నారు. వారం రోజుల పాటు మహారాష్ట్రలోని ఎంపిక చేసిన నగర మునిసిపాలిటీల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, గ్రీనరీ, పరిపాలన తదితర అంశాల్లో తీసుకుంటున్న చర్యలను పరిశీలించనున్నారు. అక్కడి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. స్టడీ టూర్ కోసం వారం రోజుల పాటు సెలవులో ఉండటంతో డీఈ రాంప్రసాద్‌రెడ్డిని ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు.

పోలీస్ గస్తీ ఏర్పాటు చేయించండి


డీఎస్పీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో 1350 మంది విద్యార్థులు చదువుకుంటున్న రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ వద్ద ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టడానికి పోలీసు గస్తీని ఏర్పాటు చేయించాలని డీఎస్పీ శ్రీనివాస్‌ను పాఠశాల హెచ్‌ఎం రవిబాబు, ఉపాధ్యాయులు కోరారు. బుధవారం డీఎస్పీని ఉపాధ్యాయులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్కూల్ మొదలు, సాయంత్రం వేళ విద్యార్థినులను కొందరు ఆకతాయిలు వెంటబడి వేధిస్తున్నారని, అందువల్ల ఆయా సమయాల్లో పోలీసు గస్తీని ఏర్పాటు చేయించాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. పాఠశాల ఉపాధ్యాయులు రాఘవ, రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్కూల్ వద్ద జంక్‌ఫుడ్ అమ్మకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కలిసి కోరారు.

అనారోగ్యంతో కౌన్సిలర్ మృతి

గుంతకల్లుటౌన్: పట్టణానికి చెందిన 35వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మహ్మద్ షరీఫ్(49) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. షరీఫ్ బుధవారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్, స్కానింగ్ పూర్తి చేసుకుని బయటకు వచ్చే క్రమంలో మరణించినట్లు అతని బంధువులు తెలియజేశారు. షరీఫ్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ అందజేత


పాఠశాలకు ఫర్నీచర్, కంప్యూటర్లను అందిస్తున్న బ్యాంకు అధికారులు

పుట్లూరు: కడవకల్లు ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ తాడిపత్రి బ్రాంచ్ ద్వారా రూ.1.75లక్షల విలువైన ఫర్నిచర్, కంప్యూటర్ పరికరాలను బుధవారం ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సాయి క్రిష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థుల కోసం ఐడీబీఐ బ్యాంకు చేస్తున్న కార్యక్రమం హర్షణీయమన్నారు. ఎంఈఓ-2 ప్రేమ్‌కుమార్, హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ వెంకట అన్వీష్, ఎస్‌ఎంసీ చైర్మెన్ నాగమునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరం


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని హ్యుమానిటీస్, సైన్సెస్ విభాగం అధిపతి డాక్టర్ గురు సిద్దప్ప పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ ఇంట్రడక్షన్ కార్యక్రమంలో భాగంగా హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం వారు బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించుకునే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురు సిద్దప్ప మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులతో పాటు ఆరోగ్యం కూడా ఎంతో అవసరం అన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మకత, షటర్ బగ్ క్లబ్, టోస్ట్ మాస్టర్ క్లబ్‌పై పరిచయం, క్రమశిక్షణ, యాంటీ ర్యాగింగ్ కమిటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఏడిపింఛన్

- కనికరం లేని కూటమి సర్కారుపై దివ్యాంగుల మండిపాటు
- 392 మంది దివ్యాంగులకు పెన్షన్లు రద్దు చేస్తూ నోటీసులు
- మున్సిపల్ ఆఫీసు వద్ద బాధితుల ధర్నా


గుంతకల్లు మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

గుంతకల్లుటౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దివ్యాంగుల పెన్షన్ల సొమ్మును పెంచుతామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఊదరగొట్టారు. వారి కల్లిబొల్లి మాటలతో దివ్యాంగులంతా ఆనందపడ్డారు. కానీ వారి సంతోషం సరిగ్గా 14 నెలలకే ఆవిరైపోయింది. అనర్హత పేరుతో వేటు వేసి కొన్నేళ్లుగా వారికి వస్తున్న పెన్షన్లను ఆపేసి వారి కడుపుకొట్టేందుకు సిద్ధమైంది. రీవెరిఫికేషన్ పేరిట అర్హులకు అన్యాయం చేస్తోంది, కొన్నేళ్లుగా దివ్యాంగ పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు కొత్త నిబంధనల పేరిట కొర్రీ పెట్టి ఏడిపిస్తోంది. గత సదరం ధ్రువపత్రాలను రద్దు చేసి వైకల్య శాతం 40 కంటే తక్కువ ఉందన్న కారణంతో దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను నడిరోడ్డుపై నిలబెట్టింది. కూటమి ప్రభుత్వానికి దివ్యాంగుల పట్ల కనికరం లేదంటూ గుంతకల్లులో పింఛన్ రద్దు నోటీసులు అందుకున్న లబ్ధిదారులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వ వైఖరిపై వారు దుమ్మెత్తిపోశారు.

25 శాతం మందికి పింఛన్ కట్..

గుంతకల్లు మున్సిపాల్టీ పరిధిలోని 37 వార్డుల్లో వృద్ధాప్య, వితంతువు, వికలాంగ, ఒంటరిమహిళ, చేనేత వివిధ కేటగిరిల కింద మొత్తం 12,130 పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరిలో 1,612 మంది దివ్యాంగుల పింఛన్ పొందుతున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో అనర్హులు లబ్ధిపొందారన్న ఆరోపణలతో కూటమి ప్రభుత్వం కొన్ని నెలల క్రితం రీవెరిఫికేషన్ పేరిట సర్వే చేపట్టడమే కాకుండా సంబంధిత వైద్యుల చేత మరోసారి పరీక్షలు చేయించింది. అయితే పట్టణంలో 392 మంది దివ్యాంగులకు వైకల్య శాతం 40 కంటే తక్కువ ఉందని, అందువల్ల వచ్చే నెల నుంచి పింఛన్‌ను రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. చాలా మంది అర్హులకు అనర్హత నోటీసులు అందడంతో వారిలో తీవ్ర ఆందోళన మొదలైంది. వారంతా వార్డు సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రీ వెరిఫికేషన్ పేరిట రోడ్డున పడేశారు



నా పేరు పద్మ. నేను పుట్టుకతో పోలియో వ్యాధిగ్రస్తురాలిని. నేను నడవటానికి చాలా ఇబ్బంది. గత 20 ఏళ్లుగా పింఛన్ పొందుతున్నాను. ఉన్నఫలంగా వచ్చే నెల నుంచి పింఛన్‌ను రద్దు చేస్తున్నామని నోటీసు పంపారు. రీవెరిఫికేషన్ పేరిట దివ్యాంగుల పింఛన్లను రద్దు చేసి రోడ్డు మీద నిల్చోబెట్టి అన్యాయం చేస్తున్నారు.

దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: రీ వెరిఫికేషన్ పేరిట రద్దు చేసిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. పట్టణంలో దివ్యాంగుల పింఛన్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ ఆఫీసు ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. పుట్టుకతో పోలియో, మానసిక వికలాంగులుగా ఉన్న అర్హులైన వారి పింఛన్‌లను తొలగించడమేంటని ప్రశ్నించారు. దివ్యాంగులను రోడ్డుకెక్కించిన కూటమి ప్రభుత్వంపై వారు నిప్పులు చెరిగారు. 22న మున్సిపల్ ఆఫీసు ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. నాయకులు జగ్గిలి రమేష్, నాగరాజు, తిమ్మప్ప, రమేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం వైకల్యమున్నా..



నా పేరు హబీబా. నా భర్త షేక్షావలి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మాకు ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు షేక్ అఫ్సా పుట్టుకతోనే మానసిక దివ్యాంగురాలు. మాటలురావు. నడవలేదు. మంచానికే పరిమితమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సదరం క్యాంప్‌లో పాపను పరీక్షించిన వైద్యులు 100 శాతం వైకల్యం ఉందని సర్టిఫికేట్ జారీ చేశారు. ఇన్నేళ్లు పింఛన్ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు తాత్కాలిక వైకల్యమని నిర్ధారించి పింఛన్‌ను రద్దుచేస్తామని నోటీసు ఇచ్చారు. నిజమైన అర్హురాలి పింఛన్ తొలగించి మమ్మల్ని ఏడిపించడం ప్రభుత్వానికి తగదు.

చిన్నచూపు తగదు



నా పేరు ఎం.భాగ్యేష్. 2013లో బళ్లారికి వెళ్లేందుకు గుంతకల్లు రైల్వేస్టేషన్ రైలు ఎక్కుతుండగా కాలు జారి రైలు కిందపడటంతో నా ఎడమ చేతిని కోల్పోయాను. వైకల్యం కారణంగా నేను ఏ పనికి వెళ్లినా నీకు చేతకాదని పంపుతున్నారు. నాకు 2014లో సదరమ్ క్యాంప్‌లో వికలాంగుడి సర్టిఫికెట్‌ను ప్రభుత్వం జారీ చేసింది. 11 ఏళ్లుగా ప్రభుత్వం తరపున వికలాంగుల పింఛన్ పొందుతున్నా. రీవెరిఫికేషన్ పేరిట అనర్హుడిగా గుర్తించామని, పింఛన్ రద్దు చేస్తున్నట్లు నోటీసు ఇచ్చారు. మా లాంటి వికలాంగుల కడుపుకొట్టడం ఎంతమేరకు సబబు. ప్రభుత్వం వెంటనే స్పందించి నా పింఛన్‌ను కొనసాగించాలి.

పెన్షనర్లకు కరువు భత్యం అందించాలి

తాడిపత్రిటౌన్: ఈపీఎస్– 95 పెన్షనర్లకు కనీస కరువుభత్యం అందజేయాలని ఎన్ఏసీ, ఎన్‌టీసీ పెన్షనర్ల సంఘం సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యర్రగుంటపల్లిలోని యర్రగుంటపల్లి కాటన్‌మిల్ ఎన్ఏసీ, ఎన్‌టీసీ సంఘం కార్మికులు స్థానిక ఆంజనేయస్వామి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. సంఘం కేంద్ర కమిటీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ శ్రీలక్ష్మీ కార్వాడీ, వైస్ ప్రెసిడెంట్ ఎన్ ప్రసాద్‌రావు హాజరై మాట్లాడారు. తాము ఈపీఎస్–95 పెన్షన్ స్కీంలో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్‌కు అర్హత కోల్పోయామన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు పెన్షనర్లకు కరువు భత్యం పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి దాదాపు 11 ఏళ్లు గడిచినా న్యాయం జరగడం లేదన్నారు. పెన్షనర్లకు కరువు భత్యం రూ.7500 ఇవ్వాలని అలాగే పెన్షనర్ భార్యాభర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, సెక్రటరీ సుబ్బయ్య, జిల్లా ప్రెసిడెంట్ రామిరెడ్డి, కార్మికులు నాగప్ప, మల్లికార్జున, నరసింహారెడ్డి, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ ఏడాది వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యస్.బద్రీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటర్ వెహికల్, మెకానిక్ డీజల్, కోప కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను మూడవ విడుత కింద భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తరువాత ఒరిజనల్ సర్టిఫికెట్లను దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 26న చివరి తేదీ అని, సర్టిఫికెట్ వెరికేషన్‌కు 27వ తేదీ వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 29న అభ్యర్థులకు 29న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు రంగనాథుడి కల్యాణం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో గురువారం మాణిక్య రంగనాథ స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా శ్రావణమాసం సందర్భంగా ఆలయ ఆవరణలో రంగనాథ స్వామికి శ్రీదేవి, భూదేవిలతో ఆనవాయితీగా కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. కల్యాణ కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హాజరవుతారన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ధర్మకర్త కోరారు.

ఘనంగా కేసీ నారాయణ జయంతి


కేసీ నారాయణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంతకల్లు: స్థానిక శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో బుధవారం కేసీ నారాయణ 86వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేసీ నారాయణ గుంతకల్లు పరిసర ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పలు కళాశాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆర్‌కే నాయుడు, డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


ఇన్‌చార్జ్ ఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఉప సర్పంచు, వార్డు సభ్యులు

యాడికి : యాడికి పంచాయతీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వార్డు సభ్యులు కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచు పండు అనురాధ అధ్యక్షతన ఇన్‌చార్జ్ ఈఓ శశికళ సాధారణ సమావేశం నిర్వహించారు. పంచాయతీలోని పలు కాలనీల్లో డ్రైనేజీ, వీధిలైట్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వార్డు సభ్యులు మండిపడ్డారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ త్వరగా పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ నిధుల మంజూరు విషయంలో పాలక మండలి సభ్యులతో చర్చించి మెజారిటీ సభ్యుల అనుమతి మేరకే బిల్లులు, తీర్మానాలు చేయాలంటూ పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జ్ ఈఓకు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తిరుపతి, శ్రీధర్, పరమేశ్వరరెడ్డి, నాగేంద్ర, బాల పెద్దయ్య, రామచంద్ర, శ్రీరాములు, లక్ష్మిదేవి, నాగభూషణం, పద్మావతి, సుధారాణి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘ఆడబిడ్డ నిధి పథకం అమలెన్నడు?’


పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

పుట్లూరు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకమైన ఆడబిడ్డ నిధి అమలుకు ఎంత కాలం సమయం తీసుకుంటుందని సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య ప్రశ్నించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలకు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మండల సహాయ కార్యదర్శులు పెద్దిరాజు, బాలు, పెద్దన్న, దావీద్, దేవుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రైల్వేలైన్ ప్రత్యామ్నాయ మార్గాల్లో ఏర్పాటు చేయాలి


రైల్వే సహాయ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ అంబికా, నాయకులు

గుంతకల్లు: పట్టణ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రైల్వేలైన్ కోసం ప్రత్యామ్నాయ మార్గాలకు అన్వేషించాలని కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నకు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎంపీతో పాటు పట్టణానికి చెందిన కేసీ హరి, సర్పంచ్ శ్రీరాములు, నాయకుడు ఓబి తదితరులు ఢిల్లీలోని మంత్రి చాంబర్‌లో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంతకల్లు సమీపంలోని గుంతకల్లు కొట్టాల, దోనిముక్కల, తిమ్మాపురం, నక్కనదొడ్డి, వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామాలకు చెందిన వ్యవసాయ పొలాల్లో ఉన్నఫలాన రైల్వే అధికారులు కొత్త రైలు మార్గం కోసం మార్కులు వేశారన్నారు. పట్టణంలోకి ప్రవేశించాలన్నా..నిష్క్రమించాలన్నా రైల్వే క్రాసింగ్ గేట్లు, అండర్‌పాస్ బ్రిడ్జిల ద్వారా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ నూతన లైన్ ఏర్పడితే రైల్వేట్రాక్‌లతో గుంతకల్లు ద్వీపంగా మారుతుందన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: పంటలు సాగు చేసిన రైతులు సస్య సంరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్.కె.లక్ష్మణ్, డాక్టర్.ఐ.భాస్కర్‌రావు, డాక్టర్.ఎం.భవాని సూచించారు. కరిడికొండ గ్రామ శివారులో వర్షాధారంగా సాగు చేసిన వేరుశనగ, ఆముదం, కంది, సజ్జ పంటలను శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి కంది, ఆముదం పంటల్లో వరుసల మధ్యలో గొడ్డు సాళ్లు వేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగు నివారణకు థయోమిథాక్సమ్ పురుగు మందు రెండు ఎంఎల్ చొప్పున లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. ఆముదంలో కాయకుళ్లు తెగులు నివారణకు కార్బండిజమ్ మందు ఒక గ్రాముకు లీటరు నీటిని కలుపుకొని పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయంలో సాంకేతిక సలహాల కోసం రైతులు రేకులకుంటలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డెటా రికార్డర్ సోమశేఖర్, వన్నేదొడ్డి, బాచుపల్లి, కరిడికొండ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్షయ రహిత దేశ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం


విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: క్షయ రహిత దేశ నిర్మాణమే లక్ష్యంగా భారత ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. బుధవారం కళాశాల జువాలజీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ నివారణ చర్యలు, చికిత్సపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జువాలజీ హెచ్‌ఓడీ జమీలబీబీ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్, అధ్యాపకులు భీమలింగయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కాలేజీ ఆవరణలో ఆవిష్కరణ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులను ప్రోత్సహించడానికి కాలేజీ కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ యు.రాఘవేంద్ర రూ.5 వేలు విరాళంగా ప్రకటించారు.

దోమల నిర్మూలనతో రోగాలు రావు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ సుమంత్ రెడ్డి, వైద్య సిబ్బంది

యాడికి: దోమల నిర్మూలనతో రోగాలు రావని యాడికి వైద్యాధికారి సుమంత్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని నం:1 ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం దోమల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వాస్పత్రికి పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. అనంతరం దోమల నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి, టీచర్లు నబీరసూల్, జయరాంరెడ్డి, సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రభాకర్ ప్రజలకు సూచించారు. గుత్తి ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం దోమల నివారణకు చర్యలు తీసుకుంటానని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.

యాడికి: దోమల నిర్మూలనతో రోగాలు రావని యాడికి వైద్యాధికారి సుమంత్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని నం:1 ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం దోమల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి, టీచర్లు నబీరసూల్, జయరాంరెడ్డి, సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మృతుని కుటుంబానికి పరామర్శ

పామిడి: అక్కజాంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న వెంకటరెడ్డి బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, మాజీ ఎంపీపీ కే నారాయణరెడ్డి సాయంత్రం గ్రామానికి చేరుకుని చిన్న వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గుంతకల్లును జిల్లా కేంద్రంగా చేయాలి

గుత్తి: గుంతకల్లును జిల్లా కేంద్రంగా చేయాలని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గుత్తిలో బుధవారం ఆయన వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరదరాజులు, సోషల్ మీడియా ప్రతినిధులు జ్ఞానేశ్వర్ రెడ్డి, బ్రహ్మరెడ్డి, సుబ్బు, అనిల్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, ఇందులో భాగంగా గుంతకల్లును జిల్లా చేస్తే అన్ని విధాల అభివృద్ధి చెందే అవకాశముంటుందన్నారు.

కాంగ్రెస్ జిల్లా కమిటీలో గుంతకల్లు నేతలకు చోటు

గుంతకల్లు: పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులకు ఆ పార్టీ జిల్లా కమిటీలో చోటు లభించింది. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా అలం నవాజ్, యమ్.ఫిరోజ్‌ఖాన్‌తోపాటు ప్రధాన కార్యదర్శిగా నబీరసూల్ నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని నూతనంగా నియమితులైన నాయకులు పేర్కొన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

శింగనమల: నియోజకవర్గంలో ఓటర్ల నమోదు, పోలింగ్ బూత్‌లు ఏర్పాటుపై గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల తరపున ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. పోలింగ్ బూత్‌లు, ఓటరు నమోదు తదితర విషయాలపై చర్చించనున్నట్లు వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శింగనమల: తరిమెల పరిసర ప్రాంతంలో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.35 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వ ఖాజీగా అల్హాజ్ ఫజుల్ రెహ్మాన్

పామిడి: పట్టణ ప్రభుత్వ ఖాజీ మౌలానాగా పట్టణానికి చెందిన అల్హాజ్ ఫజుల్ రెహ్మాన్ సాహెబ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా మైనార్టీ కార్యాలయంలో బుధవారం ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

29లోపు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

గుత్తి రూరల్: పింఛన్లకు అర్హులైన వారు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో రీవెరిఫికేషన్ ద్వారా 530 మంది పింఛన్లను ప్రభుత్వం తొలగించిందన్నారు. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే వైద్య పరీక్షలు నిర్వహించి పింఛన్లు మంజూరు చేస్తామన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

శింగనమల/ యాడికి/ పెద్దవడుగూరు: వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్, యాడికి ఐసీ ఈరన్న, పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం ఆయా పోలీస్‌స్టేషన్లలో వారు విలేకరులతో మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు తమతోపాటు విద్యుత్, అగ్నిమాపక శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి ఘర్షణలు జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా విశాలమైన ప్రదేశంలో విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణం

గుత్తి: స్థానిక మార్కెట్‌యార్డులో బుధవారం మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ప్రమాణ కార్యక్రమం జరిగింది. ట్రాక్టర్లు, బైక్‌లు,కార్లతో రాయల్ సర్కిల్ వద్ద నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. దీంతో దాదాపు రెండున్నర గంటలపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమక్షంలో మార్కెట్ యార్డు సెక్రటరీ బాలాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా గుర్రాల సూర్య ప్రతాప్, వైస్ చైర్మన్‌గా మాలిక్ బాషా , మరో 8 మంది డైరెక్టర్లతో ప్రమాణం చేయించారు.